క్లుప్తంగా

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ తమ లక్ష్య సాధన దిశలో కష్టాలకు భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగినప్పుడే లక్ష్యాన్ని సాధించగలుగుతామని ఆటమ్స్ గ్రూప్ సంస్థల డైరెక్టర్ చైర్మన్ ఎస్ అయ్యప్ప తెలిపారు. మంగళవారం గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో స్టెప్ యువజన సరీ్వసులు, స్వశక్తి సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతూ ఎదుటివారికి స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. స్టెప్, స్వశక్తి సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సెలింగ్ గురించి వివరించారు. విద్యార్థినులు తమ లక్ష్య సాధనకు ఏవిధంగా కృషిచేయాలి వివరించారు. ఉన్నత ఆలోచనలతో లక్ష్య సాధన దిశగా కృషిచేసి, కష్టాన్ని సైతం ఇష్టంగా కష్టపడితే అనుకున్నది సాధించగలమని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య, సీహెచ్ స్వర్ణచరణిరామ్, బి జూయిస్, ఆర్ షారూన్‌రోజ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణభారతినగ్ 4వ లైనుకు చెందిన సిత్తరాల శ్రీనివాసరావు ప్రైవేట్ సంస్థలో కార్మికుడిగా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పనిమీద ద్విచక్రవాహనంపై అడవితక్కెళ్లపాడు నుంచి తిరిగి వస్తుండగా దారి మధ్యలో కుక్క అడ్డువచ్చి సడన్ బ్రేక్ వేయటంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు అవ్వటంతో స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగానే ఉందని తెలిపారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుంటూరురూరల్: కుటుంబ సమస్యల కారణంగా వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాడు కాలువ సెంటర్‌కు చెందిన తాళ్లూరి శ్రీనివాసరావు (50) ఇటీవల బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యం నిమిత్తం నరసరావుపేట వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికి వచ్చిన తరువాత వారం రోజులుగా భార్యాభర్తలు గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో శ్రీనివాసరావు మనస్థాపానికి గురై సోమవారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జీజీహెచ్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేసేందుకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే బాలయ్య కోరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి లిఖిత పూర్వకంగా మంగళవారం ఫిర్యాదు చేశారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఇంటర్ అర్హతగా పేర్కొన్నారని, తాజాగా ఇచ్చిన నోటిఫికేషన్‌లో డిగ్రీ అర్హతగా ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్న వారికి నిబంధనల ప్రకారం ఇంటర్ అర్హత సరిపోతుందని, ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ రద్దు చేసి నూతన నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోటా మాల్యాద్రి, నగర కార్యదర్శి విజయ్‌బాబు, జీజీహెచ్ బ్రాంచి ఉపాధ్యక్షుడు వి.నాగరాజు, పి.ఏడుకొండలు, బ్రాంచి సహాయ కార్యదర్శి అబ్రహం పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

లక్ష్మీపురం: ఉపాధి హామీ కూలీలకు రావలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ తేజను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.95 కోట్లు తక్షణమే విడుదల చేయాలని, అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బందిపై అధికార పార్టీ నేతలు రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. 100 రోజులుపని పూర్తి అయిన ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాసు, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రంకొండ సత్యానందం, రెంటాల కుమారి, మేరిగ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భయపడొద్దు అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్
- టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన కార్యకర్తకు పరామర్శ



వంగా వెంకటరెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరురూరల్: కార్యకర్తలకు పార్టీ, నేను అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. జొన్నలగడ్డ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి వంగా సీతారామిరెడ్డి తండ్రి వెంకటరెడ్డిపై ఇటీవల టీడీపీ గూండాలు దాడి చేయడంతోపాటు అదే పార్టీలో కొనసాగితే అంతుచూస్తామని బెదిరించటంతో భయాందోళనకు గురైన ఆయన తీవ్ర అనారోగ్యానికి గురై నగరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన బలసాని మంగళవారం ఆసుపత్రికి చేరుకుని వెంకటరెడ్డిని పరామర్శించారు. అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. స్థానిక వైద్యులను వెంకటరెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి మెరుగైన చికిత్సను అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్తకు పరామర్శ

రూరల్ మండలంలోని దాసరిపాలెం గ్రామానికి చెందిన యనమల ప్రభుదాసు ఇటీవల ప్రమాదవశాత్తూ ఇంటివద్ద జారిపడి కాలుకు తీవ్రగాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని మంగళవారం ప్రభుదాసును ఆయన ఇంటివద్ద పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.



ఏడుకొండలు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న బలసాని కిరణ్‌కుమార్

ఏడుకొండలుకు నివాళి

ప్రత్తిపాడు: మండల పరిధిలోని యనమదల గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారు ఏడుకొండలు సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ఏడుకొండలు భౌతికకాయాన్ని మంగళవారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యాబుద్ధులతోనే ఉజ్వల భవిష్యత్

ఎస్టీ కాలనీలో బడిఈడు చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం



ప్రత్తిపాడు ఎస్టీ కాలనీలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: విద్యాబుద్ధులు నేర్చుకుంటే మీతోపాటు మీ పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం పేర్కొంది. ప్రత్తిపాడు ఎస్టీ కాలనీకి చెందిన బడి ఈడు చిన్నారులు బడికి వెళ్లకుండా యాచనబాట పడుతున్నారంటూ సోమవారం 'సాక్షి'లో 'విద్యాశాఖ మొద్దు నిద్ర.. బంగారు బాల్యం ఛిద్రం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం విద్యాశాఖ అధికారులు కాలనీలో పర్యటించి కొందరిని బడిబాట పట్టించిన విషయం తెలిసిందే. తాజాగా కలెక్టర్ ఆదేశాల మేరకు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు స్థానిక మండల విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి ఎస్టీ కాలనీలో పర్యటించారు. టీంను చూసిన వెంటనే కాలనీలోని బడిఈడు చిన్నారులు కొందరు పొలాల్లోకి పరుగులుపెట్టారు. దీంతో వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడిఈడు చిన్నారులు ఎంత మంది ఉన్నారు? ఎవ్వరెవ్వరు బడికి వస్తున్నారు? రాని వారు ఎవ్వరు అనే వివరాలు సేకరించారు. బడికి పిల్లలను పంపని తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఎందుకు బడికి పంపడం లేదని ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానం చెప్పడంతో టీం వారిని సున్నితంగా మందలించడంతోపాటు రేషన్ కార్డులు నిలిపివేస్తామని, పెన్షన్లు కట్ చేస్తామంటూ హెచ్చరించారు. దీంతో రేపటి నుంచి పాఠశాలకు పిల్లలను క్రమం తప్పకుండా పంపిస్తామని తల్లిదండ్రులు టీం సభ్యులకు చెప్పారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని, పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని టీం సభ్యులు కోరారు. చిన్నారులను పనికి పంపడం చట్టరీత్యా నేరమని, అలా పిల్లలను పనులకు పంపిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. టాస్క్‌ఫోర్స్ టీంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు జి.పాండురంగారావు, కె.సాంబశివారెడ్డి, ఏఎస్‌ఐలు జి.బేబిరాణి, కె.లక్ష్మి, ఫ్యాక్టరీస్ అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ వి.దేవసేన, బచపన్ బచావో ఆందోళన్ స్టేట్ కోఆర్డినేటర్ జి.తిరుమలరావు, చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ ఎస్.నవీన్‌కుమార్‌లతో పాటు ప్రత్తిపాడు ఎంఈవో-2 జి.లీలారాణి, హెచ్‌ఎం సదాశివరావు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో ఉపాధ్యాయులు రాజీ లేకుండా మెనూ ప్రకారం ప్రతి రోజూ విద్యార్థులకు మంచి పోషక విలువలు కలిగిన భోజనాన్ని అందించాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి పాఠశాలలో ప్రతి రోజూ పోషకాలతో కూడిన భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బియ్యం లారీ స్వాధీనం



ప్రత్తిపాడు: బియ్యం బస్తాల లోడుతో వెళుతున్న ఓ లారీని ప్రత్తిపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి తమిళనాడు రాష్ట్రం మధురైకు గుట్టుచప్పుడు కాకుండా లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం 100 డయల్ ద్వారా సోమవారం అర్ధరాత్రి పోలీసులకు అందింది. ప్రత్తిపాడు ఎస్‌ఐ కె.నాగేంద్ర ప్రత్తిపాడు మండలం యనమదల 16వ నంబరు జాతీయ రహదారిపై లారీని నిలిపి తనిఖీ చేశారు. అందులో 500 బ్యాగుల్లో బియ్యం, నూకల బస్తాలు ఉండటాన్ని గమనించారు. లారీని అదుపులోనికి తీసుకుని ప్రత్తిపాడు స్టేషనుకు తరలించారు. మంగళవారం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. లారీలో ఉన్నది రేషన్ బియ్యమా కాదా అనేది నిర్ధారించేందుకు ఆర్‌ఐ సాహితి, యనమదల వీఆర్వో ఆదినారాయణలు ఎస్‌ఐ సమక్షంలో బియ్యం శాంపిల్స్‌ను సేకరించారు. వాటిని జిల్లా కేంద్రంలోని డీఎస్‌వో కార్యాలయానికి పంపారు. శాంపిల్ నివేదికలు వచ్చిన తరువాత తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. అయితే బస్తాల్లో ఉన్నది నూక కాగా, రేషన్ బియ్యమా, కాదా అన్నది తెలియాల్సి ఉన్నది.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తుమ్మలపాలెంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమార్



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు

గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమార్

ప్రత్తిపాడు: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్‌కుమార్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన మంగళవారం మండల పరిధిలోని తుమ్మలపాలెంలో గర్భిణులు, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ తల్లిపాలు తాగిన శిశువుల్లో యాంటీబాడీస్ వృద్ధి చెంది ఇన్‌ఫెక్షన్లు, నిమోనియా, డయేరియా వంటి వ్యాధులు సోకవని తెలిపారు. మార్కెట్‌లో లభించే ఏ ఆహార పదార్థాలూ తల్లిపాలకు సాటిరావని చెప్పారు. తల్లిపాలలో కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫ్యాట్‌లతో పాటు విటమిన్లు, మినరల్స్, జీర్ణవ్యవస్థకు సంబంధించిన ఎంజైమ్స్, హార్మోన్లు, యాంటీబాడీస్, లింఫోసైట్లు కూడా ఉంటాయి.

■ ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సెక్టారులోని రావిపాటివారిపాలెం, గొట్టిపాడు సెక్టారులోని వంగిపురం బీసీ-4, ఓసి-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు భారతి, మాధవిలు మహిళలతో తల్లిపాల వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. పిల్లలకు పాలు సమకూరాలంటే సాధారణంగా సమకూరే క్యాలరీల కంటే ఐదు వందల క్యాలరీల శక్తిని అదనంగా ఇచ్చే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బి.మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.రాజ్యలక్ష్మి, ఎం సరస్వతి, కె వెంకటేశ్వరమ్మ మహిళలు పాల్గొన్నారు.

చౌడవరంలో అవగాహన ర్యాలీ

గుంటూరురూరల్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని చౌడవరం గ్రామం హరిజనవాడ అంగన్‌వాడీ సెంటర్ నందు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేష్టం, అప్పుడే పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా గంటలోపు తల్లిపాలు పట్టించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మూఢ నమ్మకాలను వదిలి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా తల్లులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణకుమారి, గ్రామంలోని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఫ్యూజ్ బాక్సులు తొలగింపు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజు బాక్సులు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: పట్టణంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజు బాక్సులను అధికారులు తొలగించారు. సాక్షి పత్రికలో విద్యుత్ వైర్లపై అల్లుకున్న చెట్ల తీగలు, ప్రమాదకరంగా మారిన ఫ్యూజు బాక్సులపై అతీగతీ లేదే శీర్షికన ప్రచురితమైన సచిత్ర కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే సమస్యలను పరిష్కరించారు.



విద్యుత్ తీగలకు అల్లుకున్న పిచ్చి మొక్కలను తొలగించిన సిబ్బంది

పెన్షనర్ల సమస్యలను సత్వరం పరిష్కరించాలి



లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం పోస్టల్ పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తక్షణే పరిష్కరించాలని ఆర్‌ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్రప్రదాన కార్యదర్శి నిమ్మగడ్డ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక నగరంపాలెంలోని పోస్టల్ కార్యాలయం వద్ద మంగళారం ఆల్ ఇండియా పోస్టల్, ఆర్‌ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ 15 డిమాండ్లకు వెంటనే ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అన్ని శాఖల అసోసియేషన్లు సమష్టి కృషితో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఐక్యతే అపరిష్కృత సమస్యల పరిష్కారానికి మార్గమన్నారు. విశ్రాంత ఉద్యోగులపై ప్రభుత్వం చిన్న చూపు చూడటం మంచిది కాదన్నారు. ధర్నా లో పోస్టల్ గుంటూరు డివిజన్ కార్యదర్శులు వి.మోహన్‌రావు, బి.రామారావు, తెనాలి కార్యదర్శి ఎల్.ప్రసాదరావు, రాష్ట్ర కోశాధికారి సి.హెచ్.హనుమంతరావుపాల్గొన్నారు.

మా డాక్టరెవరో కాస్త చెప్పండి

పెదగొట్టిపాడు పీహెచ్‌సీ ఎదుట బైఠాయించి నిరసన తెలిపిన ఆశాకార్యకర్తలు



పెదగొట్టిపాడు పీహెచ్‌సీ ఎదుట బైఠాయించిన ఆశాకార్యకర్తలు

ప్రత్తిపాడు: మా పీహెచ్‌సీ ఏదో మాకు తెలియదు. మేం ఎవరి పరిధిలోకి వస్తామో మాకు తెలియదు. మాకు మీటింగులు ఎవరు ఎప్పుడు ఎక్కడ నిర్వహిస్తారో తెలియదు. మా డాక్టరు ఎవరో కాస్త చెప్పండి.. అంటూ ఆశా కార్యకర్తలు పీహెచ్‌సీ బయట కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోనికి వెళితే.. ప్రత్తిపాడు మండలంలో గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రత్తిపాడు కో లొకేటెడ్ పీహెచ్‌సీలు ఉన్నాయి. ఆయా పీహెచ్‌సీలకు డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్లను వేర్వేరుగా విభజించారు. ప్రత్తిపాడు కో లొకేటెడ్ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఆశా కార్యకర్తలను ఆశా డే సమావేశానికి మంగళవారం గొట్టిపాడు పీహెచ్‌సీకి రావాలని హెచ్‌వి పద్మావతి పిలిపించారు. ఈ నేపథ్యంలో వారు ఆస్పత్రి లోపలకు వెళ్లకుండా బయట మెట్లపైనే బైఠాయించి అసలు కో లొకేటెడ్ పీహెచ్‌సీ ఎక్కడ ఉంది? మా నోడల్ ఆఫీసర్ ఎవరు? మా డాక్టరెవరో చెప్పండంటూ తమ నిరసనను వ్యక్తపరిచారు. లోపలకు రావాలంటూ పీహెచ్‌ఎన్‌తోపాటు గొట్టిపాడు ఆస్పత్రి సిబ్బంది కూడా కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. అనంతరం పీహెచ్‌ఎన్ పద్మావతి ప్రత్తిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రవంతితో ఫోన్లో మాట్లాడి, వర్కర్ల నుంచి వినతిపత్రం తీసుకోవడంతో పరిస్థితి సర్దుమణిగింది.

ఆశావర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ధనలక్ష్మి అన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, ఎన్నికల మేనిఫెస్టోకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ఉద్యోగుల్లా వారాంతపు సెలవు, క్యాజువల్ లీవ్, మెడికల్ లీవ్, పండుగ సెలవులు అమలు చేయాలని కోరారు. డీఎంహెచ్‌వో ఆశా వర్కర్ల విధులకు సంబంధించి 2024 జూన్‌లో ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఆశావర్కర్లపై రాజకీయ పరమైన వేధింపులు, తొలగింపులు నిలుపుదల చేయాలని విన్నవించారు. అంతేకాకుండా ప్రత్తిపాడుకు పీహెచ్‌సీ కావాలని, మీటింగ్ హాల్‌ఆనీ, కూర్చోవడానికి స్థలం గానీ లేదని మా డాక్టర్ మాకు అందుబాటులో లేరని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.జ్యోతి, బి.రమణ, షేక్ సిరాజ్, పి.పారిజాతం, షేక్ షకీలా, జె.దుర్గ, ఎస్.వెంకాయమ్మ, కె.సుమరియమ్మ, కె.ప్రేమకుమారి, కె.సరితలు ఉన్నారు.

వ్యర్థాల నుంచి సంపద సృష్టించవచ్చు

ఐటీసీ ఫినిష్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌కె.నహిదా



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఐటీసీ ఫినిష్ ప్రాజెక్టు మేనేజర్ నహిదా

ప్రత్తిపాడు: వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటే సంపద సృష్టించవచ్చని ఐటీసీ ఫినిష్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌కె.నహిదా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఐటీసీ ఫినిష్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ మేనేజ్‌మెంట్‌లపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంపీపీ దాసరి అన్నమ్మ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. హాజరైన ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌కె.నహిదా వ్యర్థాలను ఎలా వినియోగించుకోవాలి, తడి, పొడి చెత్తలను ఎలా వేరు చేయాలి, చెత్త నుంచి సంపద ఎలా సృష్టించుకోవాలి వంటి పలు అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నహిదా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్లను పూర్తిస్థాయి వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. వ్యర్థాలతో వర్మీ కంపోస్టు తయారు చేసుకోవచ్చని తెలిపారు. ప్రాజెక్టు ఏపీఎం అరుణ, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ రామకోటయ్య, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి మేరి యునిస్



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి మేరి యునిస్

ప్రత్తిపాడు: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి మేరి యునిస్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. సబ్‌సెంటర్ల వారీగా రోజువారీ కార్యక్రమాల ప్రోగ్రెస్‌ను సమీక్షించారు. మేరి యునిస్ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి జ్వరాల సర్వే చేయాలన్నారు. అదేవిధంగా నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు, దోమకాటు వలన ప్రబలే మలేరియా, డెంగీ వంటి రోగాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే సమయాన్ని పొడిగించడం జరిగిందని, ఆన్‌లైన్ ప్రక్రియ పెండింగ్ ఉన్న వారు వెంటనే పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. పంచాయతీ, సచివాలయ ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్రైడే డ్రైడేగా చేపట్టి గ్రామాల్లోని ఆవాస ప్రాంతాలు, నివాస ప్రాంతాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని చెప్పారు. ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ మాట్లాడుతూ బిసిజి వ్యాక్సినేషన్ పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి వారు వ్యాక్సిన్ వేయించుకునేలా విస్తృతంగా చైతన్యపరచాలన్నారు. సమావేశంలో ఆశా నోడల్ ఆఫీసర్ నిర్మలాదేవి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇది మా అడ్డా...మీరు రావడానికి వీల్లేదు

- 16వ నంబరు జాతీయ రహదారిపై జోరుగా వ్యభిచారం
- రెండు వర్గాలుగా విడిపోయిన మహిళలు
- ఆధిపత్య పోరులో హిజ్రాలతో కలిసి మరో వర్గం మహిళలపై దాడి
- పోలీస్‌స్టేషనుకు చేరిన పంచాయితీ



సర్వీసు రోడ్డులో మకాం వేసి విటులకు వల వేస్తున్న హిజ్రాలు, మహిళలు

ప్రత్తిపాడు: విటుల కోసం వేశ్యా వృత్తిలో ఉన్న కొందరు మహిళలు రెండు వర్గాలుగా విడిపోయి, హిజ్రాలతో కలిసి ఒక వర్గం మరో వర్గం మహిళలపై దాడి చేయించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కొంతకాలంగా 16వ నంబరు జాతీయ రహదారి వ్యభిచారానికి అడ్డాగా మారింది. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడు మండల పరిధిలోని హైవేపై వ్యభిచారం నిర్వహించే ఒక వర్గం మహిళలను వేరొక వర్గం మహిళలు మీరు ఇక్కడకు రావడానికి గానీ ఉండటానికి గానీ వీల్లేదని, ఇది మా స్పాట్ అని చెప్పారు. ఈ విషయమై ఇరు వర్గాల మధ్య కొద్దిరోజులుగా వివాదం నడుస్తుంది. ఈ తరుణంలో ఒక వర్గం మహిళలపై దాడి చేసేందుకు మరొక వర్గం హిజ్రాల సహకారం తీసుకున్నారు. ఈ నెల 4వ తేదీన మండల పరిధిలోని తమ్మలపాలెం సమీపంలో రాత్రి పూట హైవేపై మకాం వేసి విటుల కోసం వేచి ఉన్న ముగ్గురు మహిళలను మరో వర్గానికి చెందిన నలుగురు మహిళలు ఏడుగురు హిజ్రాలతో కలిసి వచ్చి వారిని బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని గుంటూరుకు తీసుకువెళ్లారు. అక్కడ హిజ్రాలు మహిళలపై దాడి చేశారు. అంతే కాకుండా తమ వద్ద నుండి కొంత నగదు, బంగారాన్ని కూడా అపహరించారంటూ మహిళలు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై ఘటన జరిగిన మర్నాడే ముగ్గురు మహిళలు వచ్చి ప్రత్తిపాడు పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదు. తాజాగా సోమవారం రాత్రి బాధిత మహిళలు మరోసారి స్టేషనుకు రావడంతో విషయం వెలుగు చూసింది.